క్లుప్తంగా

నేడు పత్తి కొనుగోళ్లు బంద్

షాద్‌నగర్: సీసీఐ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన అన్ని పత్తి మిల్లులు పత్తితో నిండిపోయినందున శుక్రవారం పత్తి కొనుగోళ్లు జరగవని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని విక్రయించేందుకు తీసుకురావొద్దని తెలిపారు. శని, ఆదివారం సెలవు రోజులు కావడంతో రైతులు ఈ నెల 16వ తేదీ సోమవారం పత్తిని తీసుకు రావాలని పేర్కొన్నారు.

తిరుమలలో ఎమ్మెల్యే పూజలు



తిరుమలలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

షాద్‌నగర్: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తన అనుచరులతో కలిసి తిరుమల వెళ్లి స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్నారు. స్వామిని దర్శించిన వారిలో నాయకులు రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖర్, అశోక్, నెహ్రూ నాయక్, అంజియాదవ్, రవికుమార్, బుడ్డ నర్సింహ, శ్రీశైలం, నవీన్, శేఖర్, రాజు, కిట్టు, శ్రీశైలం, రాణాప్రతాప్, సందీప్, మహేశ్, వంశీ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

శతజయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: పేదల కోసం పనిచేసే పార్టీ సీపీఐ అని, పార్టీ శతజయంతి ఉత్సవాలను గ్రామగ్రామాన ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. మండలంలోని బస్తేపూర్ గ్రామంలో గురువారం గ్రామశాఖ కార్యదర్శి సత్యనారాయణ అధ్యక్షతన పార్టీ జెండా ఆవిష్కరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఈ వేడుకలను ప్రజలకు తెలిసే విధంగా ఘనంగా జరుపుకోవాలని సూచించారు. పార్టీని బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడూ గుర్తించి వాటిని పరిష్కరించేందుకు సీపీఐ పార్టీ ముందుండాలని చెప్పారు. ఈ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలు వడ్ల మంజుల, సభ్యులు లలిత, సుగుణమ్మ, రఘు, మల్లేశ్, అనంతయ్య, మానయ్య, సువర్ణ, వెంకటమ్మ, జంగయ్య తదితరులు ఉన్నారు.

యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి

కొందుర్గు: షాద్‌నగర్ పట్టణంలోని ఠాగూర్ పాఠశాల ఆడిటోరియంలో ఈ నెల 14, 15వ తేదీల్లో నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా 6వ మహాసభలను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు నీలా మోహన్‌నాయక్, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ఈ సభలకు రాష్ట్ర నాయకులు జంగయ్య, రవి హాజరవుతారని, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యాభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్ కృష్ణయ్యకు సన్మానం



ఆర్.కృష్ణయ్యను సత్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఏపీ నుంచి బీజేపీ రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా గురువారం షాద్‌నగర్ బీసీ సేన నేతలు ఆయనను ఘనంగా సత్కరించారు. బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయ్యాయాదవ్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ బీసీ సేన నాయకులు హైదరాబాద్‌లోని ఆర్.కృష్ణయ్య నివాసానికి వెళ్లి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల ప్రశాంత్, నాయకులు నరేశ్, నర్సింహాచారి, వెంకటేశ్‌గౌడ్, ఆంజనేయులు, రాఘవేందర్‌చారి, రాంచందర్, కుమ్మరి కృష్ణ, రాముచారి, రాకేశ్, తేజు, శివకుమార్, గిరి, రమేశ్, శ్రీను, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు భౌబోయ్..

- రోడ్లపై గుంపులుగా సంచారం
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- చిన్నారులు, మహిళలు, జీవాలపై దాడులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



మొయినాబాద్- సురంగల్ రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు

మొయినాబాద్: గ్రామాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా ఒక్కచోట చేరి వాహనదారులను వెంబడిస్తూ భయపెడుతున్నాయి. గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్ర వాహనదారులను వెంబడించి పరుగుపెట్టిస్తున్నాయి. రాత్రి వేళల్లో రోడ్లపై నుంచి వెళ్లే వారిపై దాడులు చేస్తుండడంతో ప్రజలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. ప్రతిరోజు గ్రామాల్లో వీధికుక్కల బారినపడి గాయపడిన సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. జీవాల మందలపై దాడులు చేసి చంపేస్తున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడే స్పందించే అధికారులు తరువాత పట్టించుకోవడం లేదు.

వాహనదారులను వెంబడించి..

మొయినాబాద్ మండల కేంద్రంతో పాటు చిలుకూరు, పెద్దమంగళారం, అప్పోజీగూడ, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, మేడిపల్లి, సురంగల్, అమ్డాపూర్, శ్రీరాంనగర్, కనకమామిడి, వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వీధికుక్కలు ఎక్కువయ్యాయి. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ వచ్చిపోయే ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తున్నాయి. దీంతో వాహనదారులు భయాందోళనకు గురై అదుపుతప్పి ప్రమాదాల బారినపడుతున్నారు. మరోవైపు గొర్రెలు, మేకల మందలపై దాడులు చేసి జీవాలను చంపేస్తున్నాయి. ఇటీవల అప్పోజీగూడ, కేతిరెడ్డిపల్లి, నాగిరెడ్డిగూడ, అమ్డాపూర్, సురంగల్ తదితర గ్రామాల్లో గొర్రెల మందలపై కుక్కలు దాడి చేసి వందల సంఖ్యలో జీవాల ప్రాణాలు తీశాయి. ఆరునెలల క్రితం మొయినాబాద్ మండలంలోని అమీర్‌గూడలో ఓ చిన్నారిపై దాడి చేసి గాయపర్చాయి. రోడ్లపై నడుచుకుంటూ వెళ్లే వారిపై, చిన్నపిల్లలపై దాడులు చేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వీధికుక్కల దాడిలో చిన్నారులు మృతి చెందిన సంఘటనలు చాలా ఉన్నాయి. శునకాల నుంచి ప్రమాదం పొంచి ఉందని స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

నగరం నుంచి తెచ్చి..

హైదరాబాద్ నగరం నుంచి వీధికుక్కలు తీసుకొచ్చి గ్రామీణ ప్రాంతాల్లో వదులుతున్నారు. దీంతో ఇటీవల కాలంలో గ్రామాల్లో వీధికుక్కలు ఎక్కువయ్యాయి. ఒక్కో గ్రామంలో సుమారు 100–200 వరకు వీధికుక్కలు ఉన్నాయి. కుక్కలు రోడ్లపై తిరుగుతుండడంతో వాహనదారులతో పాటు నడుచుకుంటూ వెళ్లేవారు భయంగా వెళ్లాల్సి వస్తోంది. పంచాయతీ అధికారులు గ్రామాల్లో స్వైరవిహారం చేసే వీధికుక్కలను పట్టించుకోవడం లేదు. రోజురోజుకు వాటి బెడద పెరుగుతున్నా నియంత్రించే చర్యలు చేపట్టడంలేదు.



అప్పోజీగూడలో కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు(ఫైల్)

బెడదను నియంత్రించాలి



గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. గొర్రెలు, మేకల మందలు, చిన్న పిల్లలపై కుక్కలు విచక్షణారహితంగా దాడులు చేస్తున్నాయి. ఇటీవల అప్పోజీగూడలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి 15 గొర్రెలను చంపేశాయి. కుక్కల బాధతో రైతు గొర్రెలను పూర్తిగా అమ్మేసుకున్నాడు. కుక్కలను నియంత్రించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గొర్కంటి రాజు, మాజీ సర్పంచ్, అప్పోజీగూడ

చర్యలు తీసుకుంటాం



ఇతర ప్రాంతాల నుంచి వీధి కుక్కలను తీసుకొచ్చి గ్రామాల్లోని చెట్ల పొదల్లో వదులుతున్నట్లు మాకు ఫిర్యాదులు వస్తున్నాయి. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ఉన్న వీధి కుక్కలకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో సంతానోత్పత్తి తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

– వెంకటేశ్వరరెడ్డి, ఎంపీఓ, మొయినాబాద్

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రజలు ముఖ్యంగా యువకులు కృషి చేయాలని మొయినాబాద్ తహసీల్దార్, అజీజ్‌నగర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి గౌతమ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్‌లోని అజీజ్‌నగర్ గ్రామ పంచాయతీ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి జమీల్ రహమాన్ గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో కార్యదర్శులు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడూ తెలుసుకోవాలన్నారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జమీల్ రహమాన్, పంచాయతీ కారోబార్ శ్రావణ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ మాడి మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాయకులు మంగలి రాములు, కొత్త జైపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమావేశం



వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ హిమబిందు

చేవెళ్ల: పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గ్రామాల వారీగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల వారీగా ఓటర్ల ప్రకారం కావాల్సిన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 330 వార్డులకుగాను 337 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే గ్రామాల వారీగా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వేశామని, ఏమైనా మార్పులు చేర్పులకు గురువారం వరకు అవకాశం కల్పించామన్నారు. దాదాపు మండలంలో పాతవాటినే కొనసాగిస్తున్నట్లు కొత్తగా 8 పోలింగ్ స్టేషన్లు పెరిగాయని తెలిపారు. ఈ విషయాలను అన్ని పార్టీల నాయకులకు తెలియజేసేందుకు ఈ సమావేశం నిర్వహించామన్నారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా వెంటనే చెప్పాలని సూచించారు. ఈ నెల 17వ తేదీన తుది నివేదిక విడుదలవుతుందని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికలకు సంబంధించిన అన్ని ప్రక్రియలను ఒక్కొక్కటిగా పూర్తిచేసి ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల ప్రక్రియకు అన్ని పార్టీల నుంచి పూర్తి సహకారం అందించాలని కోరారు. సమావేశంలో ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, సూపరింటెండెంట్ రవీందర్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెదిన నాయకులు ప్రభాకర్, కృష్ణాగౌడ్, రామస్వామి, నరహరిరెడ్డి, చంద్రశేఖర్, రాములు, సత్యనారాయణ, అరుణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేవీ రంగారెడ్డి సేవలు మరువలేనివి

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



రంగారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు, మాజీ ఎమ్మెల్యే, నాయకులు

చేవెళ్ల: స్వర్గీయ కొండా వెంకటరంగారెడ్డి ఉపముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. ఆయన జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఉన్న కేవీ రంగారెడ్డి విగ్రహానికి ఆయన కుమారుడు డాక్టర్ లక్ష్మారెడ్డి, కూతురు డాక్టర్ సాధన, బీజేపీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేవెళ్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పట్టుదలకు మారుపేరు కొండా వెంకటరంగారెడ్డి అన్నారు. జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎంతో ఉందని కొనియాడారు. రాజకీయాల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆయన అడుగుజాడల్లోనే ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నడుస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సామ మానిక్యరెడ్డి, పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణగౌడ్, శర్వలింగం, అంజనేయులుగౌడ్, జయసింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, నాగరాజు, మచ్చేందర్‌రెడ్డి, రవీందర్, వెంకట్రామిరెడ్డి, శంకర్, విక్రమ్, తదితరులు ఉన్నారు.

సమాజ సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం

కడ్తాల్: సమాజ సేవ, పేద ప్రజల ఆకలి తీర్చడమే లయన్స్‌క్లబ్ లక్ష్యమని లయన్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం ప్రధాన కూడలిలో లయన్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో వీల్స్ ఆన్ మీల్స్ అన్నదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లబ్ ద్వారా అనేక సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నా రు. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్ మాజీ గవర్నర్ రమేశ్‌బాబు, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, క్లబ్ సభ్యులు రాజేందర్ యాదవ్, వేనుగోపాల్, వెంకటేశ్, తరుణ్ కుమార్, శ్రీను, లక్ష్మయ్య, పీఆర్‌ఓ పాషా తదితరులు ఉన్నారు.

అపరిశుభ్రత.. పర్యవేక్షణ లోపం

- పాఠశాల ఆవరణలో పందుల విహారం
- గది పక్కనే చెత్తాచెదారం, ఎండిన చెట్టు కొమ్మలు
- ఇది పాఠశాలనా.. పార్కింగ్ స్థలమా అంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



తరగతి గది ఎదుట ఉన్న చెత్త వద్ద పందులు

కొందుర్గు: పరిశుభ్ర వాతావరణంలో విద్యార్థులకు విద్యాబోధన చేయాలి. విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నామని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు, నాయకులు వేదికలపై ప్రసంగాలు చేస్తుంటారు. కానీ అవి ఆచరణలో సాధ్యం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

సమస్యల మధ్య విద్యాబోధన

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని చౌదరిగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుచేసి తరగతి గదిలో ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. అయితే ఇదే మండలానికి చెందిన పెద్ద ఎల్కిచర్ల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉపాధ్యాయుడు చౌదరిగూడ పాఠశాలలోని 2వ తరగతి గదిలో తన మోటార్ సైకిల్ పెట్టి వెళ్తాడు. దీంతో విద్యార్థులు ఫర్నీచర్‌పై కూర్చోవడానికి అనుకూలంగా లేకపోవడంతో నేలపై కూర్చుంటున్నారు. ఈ మోటార్ సైకిల్ ప్రతిరోజు ఇక్కడే పార్కింగ్ చేస్తారని విద్యార్థులు చెబుతున్నారు. ఈ విషయమై స్థానికులు ఇది పాఠశాలనా.. పార్కింగ్ స్థలమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా తరగతి గది పక్కనే ఎండిన చెట్టుకొమ్మలను నిల్వ చేశారు. గది పక్కనే పెద్ద మురుగు కాల్వ ప్రవహిస్తోంది. దానికి తోడు తరగతి గది ఎదుట చెత్తాచెదారం వేయటంతో పందులు విహరిస్తున్నాయి. దీంతో దోమలు, ఈగల బెడద తీవ్రంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. విద్యార్థులు ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే పాఠశాల ప్రాంగణంలోనూ ఉన్నత పాఠశాల ఉంది. కాంప్లెక్స్ హెచ్‌ఎం సునిత ప్రతిరోజు ఈ పాఠశాలలోనే విధులు నిర్వహిస్తుంది. విద్యార్థులు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా అటువైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం. ఈ తరగతి గది పక్కనే మండల విద్యాధికారి కార్యాలయం ఉంది. అయినప్పటికీ ఎవరూ ఈ విద్యార్థుల గురించి పట్టించుకోకపోవడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



తరగతి గదిలో మోటార్ సైకిల్ పార్కింగ్ చేయడంతో నేలపై కూర్చున్న విద్యార్థులు

క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే కాలె యాదయ్య



మొయినాబాద్‌రూరల్: క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే, గ్రంథాలయ సంస్థ చైర్మన్

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో విద్య, వైద్య అభివృద్ధితో పాటు క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ, మండలస్థాయి సీఎం కప్ క్రీడల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యేతో పాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల స్థాయిలో గెలిచిన విద్యా ర్థులు జిల్లాస్థాయికి వెళ్లనున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందు కు సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో పాలుపంచుకున్నప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు రాములు, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు ఎలిగేపల్లి శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాయపడిన విద్యార్థికి సాయం

సీఎం కప్ క్రీడల్లో భాగంగా బుధవారం విద్యార్థులు కబడ్డీ ఆడుతున్న సమయంలో అప్పోజిగూడ గ్రామానికి చెందిన సాయి అనే విద్యార్థికి చేతి భుజానికి బలమైన గాయమైంది. దీంతో ఆ విద్యార్థి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య విద్యార్థి తండ్రి కృష్ణకు మండల పరిషత్ కార్యాలయంలో రూ.50ల నగదును చికిత్స నిమిత్తం అందించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

శంకర్‌పల్లి: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండలంలోని మోకిల గ్రామ క్రీడాప్రాంగణంలో నిర్వహించిన మండలస్థాయి సీఎం కప్–2024 ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సురేశ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ గిరిరాజు, ఎంఈఓ అక్బర్, నాయకులు షాబాద్ దర్శన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: గెలుపొందిన క్రీడాకారులతో ఎంపీడీఓ బన్సీలాల్, తదితరులు

క్రీడల్లోనూ రాణించాలి

షాబాద్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మోడల్ పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, స్కూల్ ప్రిన్సిపాల్ కవిత, పీడీ బాబయ్య, పీఈటీలు సతీశ్, సత్యనారాయణ, భిక్షపతి తదితరులు ఉన్నారు.

ముగిసిన మండలస్థాయి పోటీలు

కొందుర్గు: మండలస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో కబడ్డి మొదటి బహుమతి చౌదరిగూడ జట్టు, ద్వితీయ బహుమతి గాలిగూడ జట్టు, వాలీబాల్ ప్రథమ చేగిరెడ్డి ఘనాపూర్ జట్టు, ద్వితీయ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల జట్టు, ఖోఖో చౌదరిగూడ ప్రథమ, ఎదిర ద్వితీయ బహుమతులు అందుకున్నాయి. ఈ సందర్భంగా విజేతలకు అధికారులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ జగదీశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

షాద్‌నగర్‌రూరల్: క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. గురువారం పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి, మల్లేశ్, సుదర్శన్, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం

మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్

షాద్‌నగర్‌రూరల్: అన్నదానం మహాదానం అని కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో మైనార్టీ నాయకుడు అడ్డు అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఈట గణేశ్, దేవేందర్ యాదవ్, శేఖర్, చిన్న, యాదగిరి, సాదత్ తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి

తలకొండపల్లి: జర్నలిస్టులపై దాడికి పాల్పడిన నటుడు మోహన్‌బాబుపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పాత్రికేయులు డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ.. గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విలేకరులు విష్ణువర్ధన్, చంద్రకుమార్, వెంకట్‌రెడ్డి, శంకర్, తిరుపతి, గణేశ్, కరుణాకర్, చంద్రకుమార్, శేఖర్, మార్కెట్ డైరెక్టర్ అజీం, మాజీ సర్పంచ్ లలిత, జ్యోతయ్య, సురేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.